# కొనుగోలు కేంద్రం ఎక్కడ?



యాలాల, మే 9 : మండల పరిధిలోని ముకుందాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎప్పుడు ఏర్పాటు చేస్తారా... అని రైతులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం కావల్సి ఉంది. కానీ కేంద్రాన్ని ప్రారంభించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. వరి కోతలు ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా అడ్రస్ లేని కేంద్రం కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. కొనుగోలు కేంద్రం ప్రారంభం కాకపోవడం వల్ల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం పండించిన పండించిన పంటను కాపాడుకోవడం ఒక ఎత్తయితే... చేతికొచ్చిన పంటను అమ్ముకోవడం తలకు మించిన భారంగా మారిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే వడ్ల కొనుగోళ్లను ప్రారంభించాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.



### వర్షం పడితే ఏం చేయాలి



ఇంకా మా దగ్గర సెంటర్ ఏర్పాటు చేయలేదు. ధాన్యం తెచ్చి చాలా దినాలైంది. వర్షం పడితే ఏమి చెయ్యాలి. వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఎందుకు ఏర్పాటు చేస్తలేరు. వడ్లు ఎండకు ఎండిపోతున్నాయి. సెంటర్ ఎప్పుడు చాలు చేస్తారో అర్థం కావడం లేదు. వానలు పడవట్టే, వాన పడితే మొత్తం మొలకలెత్తుతై. పొద్దటి నుంచి సాయంత్రం దాకా ఎండకు కావలి ఉంటున్నాం. రాత్రి చీకట్లో భయం భయంగా ధాన్యానికి కాపలా కాస్తున్నాం.

– పసిరికాయల రాములు, ముకుందాపూర్, యాలాల

### వాన పడేనంటే మొలకలొస్తాయి



సెంటర్ చాలు కాలేదు. వర్షం పడితే అన్ని ఖరాబయిపోతాయి. వాన పడేనాంటే మొలకలస్తాయి. మేం రైతులం పాడవుతాం. చేసేది ఏమి లేక కూర్చున్నాం. వడ్లు తెచ్చి గిన్ని దినాలాయే. ఎప్పుడు సెంటర్ చాలు చేస్తారో తెలుస్తలేదు. మా బాధ ఎవరికి చెప్పుకోవాలో అర్థమైతలేదు. వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలి.

– అనంతమ్మ, ముకుందాపూర్, యాలాల

### వెంటనే కేంద్రాన్ని ప్రారంభించాలె



నెల నుంచి కోతలు ప్రారంభమైనయ్. వడ్లు కేంద్రానికి తెస్తిమి. నేటికీ వరిధాన్యం కొనుగోళ్లు ప్రారంభించక పోవడం విడ్డూరంగా ఉంది. ప్రతి రోజు మొగులు అవుతుంది. సాయంత్రమైతే వర్షానికి పూర్తిగా ఎండిన ధాన్యం తడిసి పోతుందేమోనని భయం అవుతుంది. వెంటనే కేంద్రాన్ని ప్రారంభించాలె.

– బుగ్గావాల లక్ష్మి ముకుందాపూర్, యాలాల

# అంధకారంలో గంగ్యాడ



- మూడు నెలలుగా కరెంట్ సమస్య
- రోజులో నాలుగు గంటలే సరఫరా
- సబ్ స్టేషన్ ఏర్పాటుకు గ్రామస్తుల వినతి
- అధికారులను కలిసినా ఫలితం శూన్యం
- బీఆర్ఎస్ హయాంలో బాగుండే..



గ్రామంలోని ఓ వీధిలో కూర్చొని విద్యుత్ సమస్యను చెబుతున్న గ్రామస్తులు

నవాబుపేట, మే 9: మండల పరిధిలోని గంగ్యాడ గ్రామంలో గత మూడు నెలల నుంచి విద్యుత్ సమస్య ఉంది. రోజులో నాలుగు గంటలు కరెంట్ ఉంటే చాలు అదే ఎక్కువ. విద్యుత్ సమస్యపై అనేకసార్లు ఎంతోమంది అధికారులకు చెప్పినా ఫలితం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రుళ్లు క్యాండిళ్లు, దీపాలను పెట్టుకుని కాలం వెల్లదీస్తున్నామన్నారు. పూల్లపల్లి, నరే గూడం, గంగ్యాడ గ్రామాలకు కలిపి ఒక సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని మండలంలోని సంబంధిత అధికారులకు ఎన్నోసార్లు విన్నవించినా లాభం లేదన్నారు. ఇటీవల గ్రామదేవతల జాతర జరిగినప్పుడు కూడా జనరేటర్ పెట్టుకుని ఉత్సవాలను నిర్వహిం చుకున్నామన్నారు. కరెంట్ బిల్లుల చెల్లింపులు తీసుకుపోవ డానికి సమయానికి బాగా నే వస్తారూ కానీ విద్యుత్ సమస్య గురించి చెప్పిన ప్రతిసారీ అధికారులు తమకు పట్టన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

### భరించలేకపోతున్నాం..



ఎండాకాలం పగలు, రాత్రి సమయాల్లోనూ కరెంట్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కొవ్వొత్తులతో కాలం వెల్లదీస్తున్నాం. బావులు, బోర్ల వద్ద కూడా ఇదే సమస్య వస్తుంది. బీఆర్ఎస్ హయాంలో ఇంత సమస్య ఎప్పుడు రాలేదు . మూడు, నాలుగు నెలలు అవుతుంది మరీ ఘోరం. సబ్‌స్టేషన్‌ను నిర్మించి మా తిప్పలు తీర్చాలని ప్రజాప్రతినిధులు, అధికారులను వేడుకుంటున్నాం.

–దోసాడ లక్ష్మమ్మ

### ఇంత ఇబ్బంది ఎన్నడు పడలే..



తాను ఏ రాజకీయ పార్టీకి సంబంధించిన వ్యక్తిని కాదు. అసలు రాజకీయాలతో నాకు సంబంధంలేదు కానీ గ్రామంలో మాత్రం కాంగ్రెస్ గెలిచిన్నప్పటినుంచి మాత్రం తీవ్రమైనా విద్యుత్ సమస్య ఉంది. అప్పటి కేసీఆర్ సర్కార్‌లో మాత్రం ఇంత ఇబ్బందులు పడ్డ సందర్భం రాలేదు .పూలపల్లి, నరేగూడ, గంగ్యాడ గ్రామాలకు ఒక సబ్ స్టేషన్‌ను నిర్మిస్తే కరెంట్ సమస్య ఉత్పన్నం కాదు.

– పసికే వెంకట్ రాంరెడ్డి గ్రామస్తుడు

### మరి ఇంత నిర్లక్ష్యమా!



తాను సర్పంచ్‌గా ఉన్న సమయంలోనూ ఇంత విద్యుత్ సమస్యను ఎప్పుడు చూడలేదు. గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. రైతులు తమ పంటలను ఎట్లా పండించు కుం టారు, ఇంత పట్టన్నట్లుగా వ్యవహరించడం ఏమిటి? సబ్ స్టేషన్‌ను నిర్మించి సమస్య పరిష్కరించాలి

–ఊర కుర్వ అంజయ్య మాజీ సర్పంచ్

## రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి మృతి

వెంగళరావునగర్, మే 9 : రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి మృతి చెందాడు. ఈ ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వెంగళరావునగర్ కాలనీకి చెందిన రిటైర్డ్ ఇండియన్ ఆర్మీ ఉద్యోగి సంజయ్ రావు(77) హెల్త్ చెకప్ కోసం మోండా మార్కెట్‌లోని మిలటరీ హాస్పిటల్‌కు బయలు దేరారు. ఎస్ఆర్ నగర్ బజాజ్ ఎలక్ట్రానిక్స్ వద్ద బైక్ యూటర్న్ తీసుకుంటుండగా.. మరో ద్విచక్ర వాహనం వేగంగా రావడంతో సంజయ్ రావు బ్రేక్ వేశారు. దీంతో అదుపు తప్పి కింద పడిపోయారు. అతని తలకు తీవ్ర గాయాలు కావడంతో సమీపంలోని ఓ ప్రైవేటు దవాఖానాకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే అతను మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు సంజయ్ కుమారుడు చంద్రమోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రేమ పేరుతో బాలికపై లైంగికదాడి..

బొల్లారం, మే 10: ప్రేమ పేరుతో బాలికపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిని బోయిన్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ తిరుపతి రాజు వివరాల ప్రకారం .. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓంరాజ్ షైనీ (20 ) బతుకు దెరువుకోసం బోయినపల్లికి వచ్చి చిన్న తోకట్ట వద్ద స్నేహితులతో కలిసి ఓ రూమ్ లో అద్దెకు ఉంటున్నాడు. ఇదే ప్రాంతంలో ఉంటున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన బాలిక (16) తో అతనికి పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత బాలికను ప్రేమిస్తున్నానని నమ్మించి.. తన గదికి పలుమార్లు తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఇటీవల అతను తప్పించుకు తిరుగుతుండడంతో మోసపోయానని గ్రహించిన బాలిక.. విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కోట్‌పల్లి ప్రాజెక్టు మరమ్మతులకు

# రూ.89.30 కోట్లు మంజూరు



తాండూరు, మే 9: కోట్‌పల్లి ప్రాజెక్టు మరమ్మతులకు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం తాండూరు క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...కోట్‌పల్లి ప్రాజెక్టు మరమ్మతులకు రూ. 89.30 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఇందుకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కు మార్లకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం చిలుక వాకు, గొల్ల చెరువు పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు.

# పెండ్లి సంబంధం పేరుతో మోసం

### - యువతితో పాటు మరొకరిపై కేసు

బంజారాహిల్స్, మే 9: పెండ్లి సంబంధం పేరుతో యువతిని పరిచయం చేసిన స్నేహితుడు.. ఆమెతో కలిసి రకరకాల కారణాలు చెప్పి డబ్బులు లాగి మోసం చేశాడు. ఈ ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఏపీలోని కోనసీమ జిల్లా రాజోలు మండలానికి చెందిన నానీ కుమార్(42)కు అదే గ్రామానికి చెందిన పసుపులేటి తాతా శ్రీనివాస్ స్నేహితుడు. శ్రీకృష్ణానగర్‌లో నివాసముంటున్న నానీకుమార్ తనకు సరైన పెండ్లి సంబంధాలు రావడం లేదంటూ స్నేహితుడు శ్రీనివాస్‌కు చెప్పాడు. దీంతో తనకు ఫ్యామిలీ ఫ్రెండ్‌గా ఉన్న గెడ్డం శ్రావణి మణికొండలో నివాసం ఉంటూ ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తోందని, ఆమెను పరిచయం చేసి పెండ్లికి ఒప్పిస్తానని శ్రీనివాస్ నమ్మబలికాడు. కొన్ని రోజుల తర్వాత శ్రావణి ఫోన్ నంబర్ ఇవ్వడంతో నానీకుమార్ చాటింగ్ ప్రారంభించాడు. ఇద్దరం కలిసి మాట్లాడుకుందామంటూ కోరడంతో సాకులు చెప్పి తప్పించుకుంది. చాటింగ్ ద్వారానే స్నేహాన్ని కొనసాగిద్దామని.. త్వరలోనే పెండ్లి ఏర్పాట్లు చేసుకుందామని నమ్మబలికింది. తన తల్లిదండ్రులకు బాగాలేదని.. వారి వైద్యం కోసం సాయం చేస్తే తిరిగి డబ్బులు ఇస్తానని శ్రావణి కోరడంతో ఆమె సూచించిన పలు అకౌంట్లకు సుమారు రూ.10 లక్షలు పంపాడు. అయితే కొన్ని రోజులుగా నానికుమార్ మెసేజ్‌లకు శ్రావణి, శ్రీనివాస్‌లు ఇద్దరూ స్పందించకపోవడంతో మోసం చేశారని భావించిన బాధితుడు శుక్రవారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# హైకోర్టులో మాక్ డ్రిల్

చార్మినార్, మే 9: అత్యవసర సమయాల్లో వ్యవహరించాల్సిన అంశాలపై అగ్ని మాపక అధికారులు ప్రయోగాత్మకంగా నిర్వహించి అవగాహన కల్పించారు. హైకోర్టులో శుక్రవారం అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. హై కోర్టు భవనంలో కృత్రిమ ప్రమాదాన్ని సృష్టించారు. వాటిని అదుపు చేయడానికి తీసుకున్న చర్యలు, స్థానికంగా అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుని ప్రమాదాలను నివారించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై సిబ్బందికి తమ ప్రదర్శన ద్వారా చూపించారు. మంటలను ఆర్పడం, ప్రమాదాలు జరిగితే తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూచనలతో చేపట్టినట్లు అగ్నిమాపక జిల్లా అధికారి వెంకన్న తెలిపారు.

## మున్సిపల్ కార్మికుడి నిజాయితీ..



మున్సిపల్ కార్మికుడు కిష్టయ్యను సన్మానిస్తున్న కమిషనర్ వెంకటయ్య

పరిగి, మే 9: పరిగి మున్సిపల్ కార్మికుడు నిజాయితీని చాటుకొని అందరి మన్ననలు పొందారు. వివరాల్లోకి వెళ్తే ఎప్పటివలె చెత్త సేకరణ వాహనం శుక్రవారం ఉదయం పరిగి పట్టణంలోని శ్రీనివాస్‌కాలనీకి వెళ్లగా కాలనీకి చెందిన శ్రీనివాస్‌రెడ్డి సతీమణి పొరపాటున చెత్తతో పాటు అర తులం బంగారం కమ్మలు చెత్త సేకరణ వాహనంలో వేశారు. మున్సిపల్ కార్మికుడు కిష్టయ్యకు కవర్‌లో బంగారు కమ్మలు లభించగా వాటిని తీసుకువెళ్లి శ్రీనివాస్‌రెడ్డికి అందజేసి తన నిజాయితీని చాటుకున్నారు. నిజాయితీని చాటుకున్న కిష్టయ్యను మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య సన్మానించి అభినందించారు. కిష్టయ్యను తోటి ఉద్యోగులు అభినందించారు.

## ఇండో గ్లోబల్ అవార్డు గ్రహీతకు సన్మానం



పరిగి, మే 9: ఇండో గ్లోబల్ ఎడ్యుకేషనల్ ఫెస్టివల్ 2025 అవార్డును అందుకున్న దోమ మండలం బొంపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.డి.షఫీని శుక్రవారం పరిగిలో ముస్లిం మైనారిటీ ఎంప్లాయిస్ వర్కింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బొంపల్లి పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఎడ్యుకేషన్ తరగతులను గత మార్చిలో డీఈవో ప్రారంభించగా ఇటీవల రాష్ట్ర స్థాయి బృందం విద్యార్థులను పరిశీలించి చక్కగా ఏఐ బోధన జరుగుతున్నట్లు ధ్రువీకరించారని యూనియన్ నాయకులు పేర్కొన్నారు. అలాగే బడిబయట పిల్లలు ఎవరు లేకుండా 100 శాతం ఎన్‌రోల్ చేయించారని కొనియాడారు. అంకితభావంతో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడు షఫీకి ఈ అవార్డు దక్కిందని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు మోయిస్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి ఎం.డి.జహంగీర్, ప్రధానోపాధ్యాయులు ఎం.డి. ఉస్మాన్‌అలీ, నాయకులు నజీర్, ఖాజా షరీఫ్, ఇబ్రహీం, ఎం.డి.ఇసాక్, నజీర్, యూసుఫ్, ఖాసిం, జలాల్ తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి సదస్సులో 28 దరఖాస్తులు



కొండాపూర్‌కలాన్ భూ భారతి సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో వాసుచంద్ర

ధారూరు, మే 9: మండల పరిధిలోని కొండాపూర్‌కలాన్, ధర్మాపూర్ గ్రామాల్లో రైతు భూ భారతి రెవెన్యూ సదస్సులు శుక్రవారం జరిగాయి. వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర హాజరై, రైతులు ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ మాట్లాడుతూ అధికారులు అంకిత భావంతో పనిచేసి భూముల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వికారాబాద్ ఆర్డీవో వాసు చంద్ర, ధారూరు, కోట్‌పల్లి తహసీల్దార్లు సాజిదాబేగం, శ్రీనివాస్, ధారూరు డిప్యూటి తహసీల్దార్ విజయేందర్, ఆర్ఐలు, రెవెన్యూ సిబ్బంది రైతులు తదితరులు ఉన్నారు. కాగా ధర్మాపూర్ రెవెన్యూ సదస్సులో 17 ఫిర్యాదులు, కొండాపూర్‌కలాన్ రెవెన్యూ సదస్సులో 11 ఫిర్యాదులు వచ్చినట్లు ధారూరు డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల పరిశీలన



కులకచర్ల, మే 9: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల పరి శీలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చౌడాపూర్ ఎంపీడీవో సోమలింగం, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మరికల్ గ్రామంలో ఇంటింటికీ తిరిగి పరిశీలించారు. కమిటీ సభ్యులు ఇచ్చిన జాబితా ప్రకారం అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందని తెలిపారు. వెరిఫికేషన్ తరువాత పూర్తి స్థాయి జాబితాను జిల్లా అధికారులకు పంపించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# 20.6కిలోల గంజాయి పట్టివేత



సిటీబ్యూరో, మే 9 (నమస్తే తెలంగాణ): గంజాయి రవాణా చేస్తున్న ఒక పాత నేరస్తుడిని ఆబ్కారీ ఎస్‌టీఎఫ్ పోలీసులు అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి రూ.10లక్షల విలువ చేసే 20.6కిలోల గంజాయితో పాటు కారు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌టీఎఫ్ ఈఎస్ అంజిరెడ్డి కథనం ప్రకారం...మహారాష్ట్ర ఔరంగాబాద్‌కు చెందిన జలీలుద్దీన్ సిద్ధిఖీ అహ్మమద్ హుస్సేన్ మెషిన్ ఆపరేటర్. వచ్చే జీతం సరిపోవడంతో ఉద్యోగం చేస్తూనే సైడ్ బిజినెస్‌గా వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో గంజాయి విక్రయాలకు పాల్పడుతూ 2023లో అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఆబ్కారీ పోలీసులకు పట్టుపడ్డాడు. ఆ కేసులో జైలు శిక్ష అను భవించినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ క్రమంలో ఏపీలోని సీలేరులో లక్ష్మీబాయి అనే మహిళ వద్ద 20.6 కేజీల గంజాయి కొనుగోలు చేసి, అక్కడి నుంచి నగరం మీదుగా మహారాష్ట్రకు తరలిస్తున్నాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ పోలీసులు సంగారెడ్డి పోతురెడ్డిపల్లిలో నిందితుడు ప్రయాణిస్తున్న కారును ఆపి తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. దీంతో నిందితుడిని అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి రూ.10లక్షల విలువ చేసే 20.6కిలోల గంజాయితో పాటు కారు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మీ బాయి, కృష్ణలపై కూడా కేసులు నమోదు చేసినట్లు ఆబ్కారీ అధికారులు వెల్లడించారు. కేసును తదుపరి విచారణ నిమిత్తం సంగారెడ్డి ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

## కేరు టేకర్‌గా వచ్చి.. డబ్బు కాజేసి..

వెంగళరావునగర్, మే 9 : కేర్ టేకర్‌గా వచ్చిన ఓ వ్యక్తి.. రోగి ఫోన్‌తో డబ్బును బదిలీ చేసుకున్నాడు. ఈ ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వెంగళరావునగర్ కాలనీకు చెందిన పి.హిమబిందు తండ్రి అనారోగ్యంతో మంచాన పడ్డారు. దీంతో అతని బాగోగులు చూసుకోడానికి గూగుల్‌లో కేర్ టేకర్ కోసం సెర్చ్ చేసి..కార్తికేయ అంజన్న హోం కేర్ సర్వీసెస్‌ను సంప్రదించింది. వారు నెలకు రూ.22,000 జీతంపై రవి అనే వ్యక్తిని నియమించారు. ఈ నెల 7న ఇంటి నుంచి బయటకు వెళ్తున్నానని చెప్పిన రవి తిరిగి రాలేదు. అయితే ఇంట్లో ఉన్న ఖరీదైన మొబైల్ ఫోన్‌ను కాజేసిన రవి.. మరో మొబైల్ పెట్టినట్లు గుర్తించిన హిమబిందు.. ఈ విషయాన్ని కార్తికేయ అంజన్న హోం కేర్ సర్వీసెస్‌కు చెప్పారు. రవి మరో నంబర్ ఇవ్వడంతో అతనికి ఫోన్ చేశారు. ఇప్పడే వస్తానని చెప్పి ఆ నంబర్‌ను బ్లాక్ చేశాడు. అంతే కాకుండా వారి అకౌంట్ నుంచి ఫోన్ ద్వారా రూ.63,326 ను మరో అకౌంట్‌కు బదిలీ చేసుకున్నట్లు హిమ బిందు గుర్తించింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కరెంట్ బిల్లు పెండింగ్ ఉందంటూ..

# 2.01 లక్షలు కాజేశారు

సిటీబ్యూరో, మే 9 (నమస్తే తెలంగాణ): పోయిన నెల రూ.7ల కరెంట్ బిల్లు పెండింగ్‌లో ఉందంటూ బెదిరించి ఓ ప్రైవేట్ ఉద్యోగి నుంచి సైబర్‌నేరగాళ్లు రూ. 2.01 లక్షలు కాజేశారు. ఏఎస్‌రావునగర్‌కు చెందిన బాధితుడికి ఈ నెల 6న తాము విద్యుత్ శాఖ నుంచి ఫోన్ చేస్తున్నామని, మీది ఎలక్ట్రిసిటీ బిల్లు గత నెలకు సంబంధించింది రూ. 7లు పెండింగ్‌లో ఉందని చెప్పారు. ఆ తరువాత వాట్సాప్‌కు మెసేజ్ పెట్టి మీ పెండింగ్ సెటిల్ చేసుకోకపోతే రాత్రి 7.30 గంటల వరకు కరెంట్ కట్ అవుతుందంటూ సూచన చేశారు. మీరు ఆన్‌లైన్‌లో కూడా ఆ బిల్లు సెటిల్ చేసుకోవచ్చంటూ ఏపీకే ఫైల్‌ను పంపించారు. ఆ ఫైల్‌ను క్లిక్ చేయగానే అందులో తెలంగాణ విద్యుత్ శాఖ వెబ్ పేజీ అని రాసి ఉంది. అందులోకి వెళ్లి తన బ్యాంకు వివరాలు పొందుపరిచి రూ. 7 తన నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించాడు. అయితే ఏపీకే ఫైల్‌లో తమ సొంత ఇంటర్‌ఫేస్‌ను సైబర్‌నేరగాళ్లు పంపించడంతో అతడు చేసిన నెట్ బ్యాంకింగ్‌కు సంబంధించిన వివరాలన్నీ సైబర్‌నేరగాళ్లకు తెలిసిపోయాయి. దీంతో వెంటనే ఆ ఖాతాలో నుంచి రూ. 2,01,378 ఖాళీ అయ్యాయి. తాను ఓటీపీ కూడా షేర్ చేయకుండానే ఖాతాలో నుంచి నగదు మాయమయ్యిందంటూ బాధితుడు రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

LOST

★I, NARRA NARAMMA, W/o. Narra Bikshapathi, R/o. H.No. 2-30/18/36/1/A1/A/1, Sai Nagar Colony, Kammaguda, Turkayamjal, Abdullapurmet (M), R.R. Dist., T.G. My Open Land bearing Plot No.s 120 and 121 Registration Documents No. 3639/2015 was missing at that Rented house, while searching for Registered Documents on 05/05/2025. If anybody found, please Contact: 9989373798.

NT-Jella

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# చందానగర్‌లో భారీ అగ్నిప్రమాదం

- షార్ట్ సర్క్యూట్‌తో సెంట్రో ఫుట్‌వేర్‌లో చెలరేగిన మంటలు
- పక్కనే ఉన్న ఆర్కే సిల్క్స్, ఫర్టిలిటీ హాస్పిటల్‌లకు వ్యాపించిన వైనం
- అగ్ని ప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం



కొండాపూర్, మే 9 : చందానగర్‌లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకున్నది. ప్రమాదంలో రెండు షాపింగ్ భవనాలు పూర్తిగా అగ్నికి ఆహుతవ్వగా, పక్కనే ఉన్న హాస్పిటల్ పాక్షికంగా దగ్ధమైంది. అగ్ని ప్రమాదానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. చందానగర్ సర్కిల్ – 21 పరిధిలోని చందానగర్‌లో ఉన్న సెంట్రో ఫుట్‌వేర్ షాపింగ్ భవనం నేమ్‌బోర్డులో శుక్రవారం సాయంత్రం తలెత్తిన షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. క్షణాల వ్యవధిలోనే మంటలు భవనంలోకి చేరడంతో అప్రమత్తమైన సిబ్బంది.. వెంటనే బయటకు పరుగులు తీశారు. అగ్ని ప్రమాదానికి సంబంధించిన సమాచారాన్ని పోలీస్, ఫైర్ అధికారులకు అందజేశారు. సెంట్రోలో భారీ మొత్తంలో ఫుట్‌వేర్ నిల్వలు ఉండడంతో మంటలు పెద్ద ఎత్తున ఎగిసిపడుతూ, పక్కనే ఉన్న ఆర్కే సిల్క్స్ షాపింగ్ మాల్‌కు సైతం అంటుకున్నాయి. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడుతూ సెంట్రో, ఆర్కే సిల్క్స్ భవనాలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. మంటలు అంతకంతకు పెరుగుతుండడంతో సెంట్రో భవనానికి మరో పక్కన ఉన్న ఉంబు ఫర్టిలిటీ దవాఖానకు మంటలు అంటుకున్నాయి. అప్పటికే ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపు చేస్తుండగా.. దవాఖాన బయట వైపు ఉన్న ఏసీలు, ఇతర సామగ్రి పాక్షికంగా దగ్ధమయ్యాయి. హాస్పిటల్ యాజమాన్యం అందులో ఉన్న రోగులను, సిబ్బందిని బయటికి తరలించారు. ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు.

## పేటీఎం నుంచి లోన్ ఇప్పిస్తానంటూ టోకరా

వెంగళరావునగర్, మే 9 : పేటీఎం నుంచి లోన్ ఇప్పిస్తానని నమ్మించి రూ.60 వేలు కాజేసిన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్లారెడ్డిగూడకు చెందిన కె.రాకేశ్‌కుమార్‌కు అక్కడే ఇస్త్రీ షాపు ఉంది. ఈ నెల 1న గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తాను పేటీఎం డిస్ట్రిబ్యూటర్‌నంటూ పరిచయం చేసుకున్నాడు. దీంతో రాకేశ్ తనకు రూ.5 లక్షలు రుణం కావాలని కోరగా.. ఇప్పిస్తానని నమ్మబలికాడు. దానికి రూ.5 వేలు ప్రాసెసింగ్ ఫీజుగా ఇవ్వాలని చెప్పడంతో వెంటనే రాకేశ్ అతనికి రూ.5 వేలు పంపించాడు. తిరిగి ఈనెల 4న షాపు వద్దకు వచ్చి మీకు పేటీఎం ద్వారా రూ.5 లక్షలు రుణం మంజూరైందని.. ఇందుకు రూ.70 వేలు చెల్లించాల్సి ఉంటుందని చెప్పాడు. వెంటనే రాకేశ్ ఫోన్ తీసుకుని అతని ఖాతా నుంచి రూ.55 వేలను మరో అకౌంట్‌కు బదిలీ చేసుకుని అక్కడ నుంచి జారుకున్నాడు. అయితే తన అకౌంట్లోకి లోన్ డబ్బు రాలేదని తెలుసుకుని.. అతడి గురించి ఆరా తీయగా అమీర్‌పేట్‌లో ఉంటున్నట్లు తెలుసుకున్నాడు. అక్కడికి వెళ్లి విచారించగా అతని పేరు ఫుజైల్ అహ్మద్ షరీఫ్ అని, అక్కడి నుంచి గదిని ఖాళీ చేసినట్లు తెలుసుకున్నాడు. అనంతరం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ : 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962